ఏజెన్సీల వద్ద ఎదురుచూపులు

- రూ.500 సిలిండర్ కోసం జనం ఆత్రుత
- గ్యాస్ ఏజెన్సీలు తెరవకముందే బారులుతీరిన మహిళలు
- ఈకేవైసీ కోసం క్యూకడుతున్న వినియోగదారులు
- వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- పౌర సరఫరాల అధికారులు

హుస్నాబాద్ టౌన్: ఆధార్ కేంద్రం వద్ద వేచిచూస్తున్న చిన్నారులు

సంగారెడ్డి డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల ఎదుట ప్రతిరోజూ రద్దీ కనిపిస్తున్నది. ఈకేవీసీ చేయించుకునేందుకు గ్యాస్ వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల ఎదుట బారులుతీరుతున్నారు. ముఖ్యంగా మహిళలు గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం తెరవకముందే వేకువజాము నుంచి క్యూకడుతున్నారు. ఈకేవైసీ చేయటంలో గ్యాస్ ఏజెన్సీలు తాత్సారం చేస్తుంటడంతో వినియోగదారులు గంటల తరబడి వరుసలో నిల్చుని ఇబ్బందులు పడాల్సివస్తోంది. పదిరోజులుగా సంగారెడ్డి జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల ఎదుట వినియోగదారులు బారులుతీరుతుండటంతో సందడి వాతావరణం కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే రూ.500 గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో రాయితీ గ్యాస్ పథకం అమలవుతుందని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని వినియోగదారులు అనుకుంటున్నారు. గ్యాస్ రాయితీ వర్తించాలంటే ఈకేవైసీ(ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) తప్పనిసరి భావించి గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల ఎదుట ఈకేవైసీ చేయించుకునేందుకు వినియోగదారులు క్యూకడుతున్నారు. గ్యాస్ ఏజెన్సీలు వేగంగా స్పందించి ఈకేవీసీలు పూర్తి చేయటంలేదు. దీంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని పట్టణాల్లో గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు టోకెన్లు ఇచ్చి తాము సూచించిన తేదీ రోజూ ఈకేవైసీ కోసం రావాలని సూచిస్తున్నారు. దీంతో గ్యాస్ ఏజెన్సీల తీరుపై వినియోగదారులు మండిపడుతున్నారు.

సిద్దిపేటలో గ్యాస్ ఏజెన్సీలో జనం

ఈకేవైసీ చేయటంతో ఏజెన్సీల తాత్సారం

సంగారెడ్డి జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలు ఈకేవీసీ చేయటంలో తాత్సారం చేస్తుండడంతో వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో భారత్ గ్యాస్, హెచ్‌పీ(హిందుస్తాన్ పెట్రోలియం), ఐఓసీ(ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్)కు చెందిన 35 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. 35 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో మొత్తం 5,66,858 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. సింగిల్ గ్యాస్ సిలిండర్ కనెక్షన్లు 1,81,458, డబుల్ గ్యాస్ సిలిండర్ కనెక్షన్లు 1,76,644 ఉన్నాయి. అలాగే దీపం పథకం గ్యాస్ కనెక్షన్లు 88563, ప్రధాన మంత్రి ఉజ్వల కనెక్షన్లు 48,017, సీఎస్ఆర్ కనెక్షన్లు 72,176 ఉన్నాయి. గ్యాస్ ఏజెన్సీలు ప్రతిఏటా వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలని సూచిస్తాయి. మూడు మాసాల క్రితం గ్యాస్ ఏజెన్సీలు ఈకేవైసీ చేయించుకోవాలని వినియోగదారులను కోరాయి. అయితే వినియోగదారులు అప్పుడు పెద్దగా స్పందించ లేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500కు గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రకటించడంతో వినియోగదారులు ప్రస్తుతం ఈకేవైసీ చేయించుకునేందుకు గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల ఎదుట బారులుతీరుతున్నారు. ఈకేవైసీ చేయించుకోవాలంటే గ్యాస్‌కనెక్షన్ ఉన్న వినియోగదారులు స్వయంగా గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి వెళ్లి ఆధార్‌కార్డు ఇవ్వటంతో పాటు వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది. దీంతో గ్యాస్ వినియోగదారులు జిల్లాలోని 35 గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల ఎదుట వేకువజాము నుంచే బారులుతీరుతున్నారు. గ్యాస్ ఏజెన్సీలు సరైన సమాచారం ఇవ్వకపోవం, వేగంగా ఈకేవైసీలు పూర్తిచేయక పోవటంతో గ్యాస్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ రాయితీ పథకాన్ని అమలుకు ఇంకా ఎలాంటి మార్గదర్శకాలు ప్రకటించ లేదు. అలాగే ఈకేవైసీ తప్పనిసరి అని చెప్పలేదు.ఈ విషయాన్ని గ్యాస్ ఏజెన్సీలు కానీ, పౌర సరఫరాల శాఖ అధికారులు కానీ వినియోగదారులకు చెప్పటం లేదు. గ్యాస్ రాయితీ పథకం పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అని భావించి వినియోగదారులు పెద్దసంఖ్యలో బారులుతీరుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వినియోగదారులు పట్టణాల్లోని గ్యాస్ ఏజెన్సీల వద్ద వచ్చి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్యూలో గంటల తరబడి వేచి చూస్తూ ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ ఏజెన్సీలు వేగంగా ఈకేవైసీలు పూర్తిచేయకపోవటంతో క్యూలైన్‌లో ఉన్న మహిళలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈకేవైసీ కోసం ఆందోళన అవసరం లేదు

ప్రభుత్వం గ్యాస్ రాయితీ పథకానికి సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని, వినియోగదారులు అనవసరంగా ఆందోళన చెంది గ్యాస్ ఏజెన్సీల ఎదుట క్యూకట్టవద్దని జిల్లా పౌర సరఫరాల అధికారి వనజాత తెలిపారు. వినియోగదారులు ఆన్‌లైన్‌లో లేదా ఇంటి వద్దకు వచ్చే గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది ఫోన్‌లో ఈకేవైసీ చేయించుకోవచ్చని తెలిపారు. ఈకేవైసీ సమర్పించేందుకు గ్యాస్ కంపెనీలు ఎలాంటి తుదిగడువు విధించలేదన్నారు. గ్యాస్ వినియోగదారులు అనవసరంగా గ్యాస్ ఏజెన్సీల వద్ద ఇబ్బందులు పడవద్దని సూచించారు. గ్యాస్ ఏజెన్సీలు ఈకేవైసీ కోసం వచ్చే వినియోగదారులను ఇబ్బంది పెట్టకుండా వేగంగా ఈకేవైసీ పూర్తి చేసి పంపించాలని సూచించారు.

మెదక్ పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ ఏజన్సీ వద్ద గుమిగూడిన జనం

సిద్దిపేట పట్టణంలో గ్యాస్ ఈకేవైసీ కోసం హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం వద్ద బారులు తీరిన ప్రజలు, గ్యాస్ బుక్ చూపుతున్న వినియోగదారు

ఈ కేవైసీ ఇక్కట్లు..

- గ్యాస్ వినియోగదారుల పాట్లు
- రూ.మహాలక్ష్మి పథకం కోసం పరుగులు
- ఉదయం నుంచే ఏజెన్సీల వద్ద బారులు
- చలిలో వృద్ధుల అవస్థలు
- నిత్యప్రక్రియ అంటున్న నిర్వాహకులు

సంగారెడ్డి పట్టణంలోని ఓ గ్యాస్ ఏజెన్సీ కేంద్రం వద్ద బారులు తీరిన జనం

మెదక్, (నమస్తే తెలంగాణ) డిసెంబర్ 30: మహాలక్ష్మి పథకంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన రూ.500 కే గ్యాస్ సిలిండర్‌ను పొందేందుకు మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రజలు గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్నారు. గ్యాస్ వినియోగదారులు వెంటనే ఈ కేవైసీ చేసుకోవాలని పుకార్లు రావడంతో గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ వివరాలను (కేవైసీ) అప్‌డేట్ చేయించుకుంటేనే ఈ పథకం వర్తిస్తుందని జరిగిన ప్రచారంతో వారం రోజులుగా ప్రజలు కనెక్షన్ బుక్‌లు, ఆధార్ కార్డులతో ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలో మొత్తం 17 ఏజెన్సీలుండగా 2,35,412 కనెక్షన్లు ఉన్నాయి. ఈ నెల 31లోగా ఈ కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని, లేదంటే రూ.500లకే గ్యాస్ రాదని వదంతులు సృష్టించడంతో ఉదయం 6 గంటల నుంచే తీవ్ర చలిలో వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల వద్ద క్యూ కడుతున్నారు. జిల్లాలోని ఆయా మండలాల పరిధి గ్రామాల నుంచి ఈ కేవైసీ కోసం ఏజెన్సీల వద్దకు వందలాదిగా వస్తున్నారు. ఈ కేవైసీ చేసుకునేందుకు వృద్ధ తల్లిదండ్రులను వెంట బెట్టుకుని కొడుకులు ఏజెన్సీలకు చేరుకుంటున్నారు. గ్యాస్ కనెక్షన్ ఎవరి పేరున ఉంటే వారే కేవైసీ చేసుకోవాల్సి ఉండడంతో డబ్బులు చెల్లించి ప్రేవేటు వాహనాల్లో వృద్ధులు, చంటి పిల్లల తల్లులు అవస్థలు పడుతూ వస్తున్నారు. ఆలస్యమైతే తామెక్కడ అవకాశాన్ని కోల్పోతామోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అయితే, ఈ కేవైసీపై తమకెలాంటి ఆదేశాలు రాలేదని, వినియోగదారులంతా ఒకేసారి వస్తుండడంతో సేవల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు వాపోతున్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని ఏజెన్సీల వద్ద బోర్డులు పెట్టినా ప్రజలు పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు కోరుతున్నారు.

ఎవరికీ అవగాహన లేదు..

దరఖాస్తు ఫారం నింపేటపుడు సందేహాలుంటే అధికారులను అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదు. ఈ విషయంలో ఎవరికీ పూర్తి అవగాహన లేదు. ఆరు గ్యారంటీల్లో ఏ పథకం ఎవరికి వర్తిస్తుందో తెలియట్లేదు. ఈ గందరగోళ పరిస్థితి చూస్తుంటే మాకు అన్యాయం జరుగుతుందేమో అనిపిస్తున్నది.

– చేపూరి స్వామి, లక్ష్మాపూర్ (మెదక్ జిల్లా)

దరఖాస్తు ఫారాలు అందుతలేవు..

అభయహస్తం దరఖాస్తు ఫారాలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నరు. ఒకలకు ఇచ్చిన దాన్ని జిరాక్స్ తీసుకోవాలని అధికారులు చెప్పుతున్నరు. అది సరైంది కాదు. ప్రజాపాలనలో ప్రభుత్వం అనుకున్నంత అధికారులు జేస్తలేరు. దరఖాస్తులు నింపారా నోళ్లు బతిమిలాడినా పట్టించుకుంటలేరు. తెల్వనోళ్లకు అధికారులు ఫారాలు నింపించియ్యాలే. ఫారంలో ఉన్నవి అర్థమయ్యేట్ట చెప్పాలే. – పత్తి రాజేందర్, రైతు, చెన్యాల, మిరుదొడ్డి (సిద్దిపేట జిల్లా)

కిరాయికి ఉన్నోళ్లకు కరెంట్ బిల్లు మాఫీచేయాలి

మా ఆయన ఆటో నడిపితేనే మాకు బతుకు. కిరాయికి ఉంటున్నం. మాకు కూడా సర్కారు కరెంట్ బిల్లు మాఫీ చేయాలి. ఇక్కడ దరఖాస్తు చేసుకుంటే సార్ల నుంచి మాకు తెలియదని చెబుతుంర్రు. ఇప్పుడు గిరాకీ అయితలేదు. మీం సంపాదించిన పైసలన్నీ కిరాయికి, కరెంట్ బిల్లుకు పోతున్నయి. ఈ సర్కారు మాలాంటోళ్లే కరెంటు బిల్లులు మాఫీ చేయాలి. – కర్నాల పద్మ, హుస్నాబాద్ (సిద్దిపేట జిల్లా)

ప్రజాపాలనపై ప్రజలకు అవగాహన లేదు..

ప్రజాపాలనలో ఐదు గ్యారంటీలపై ప్రజలకు దరఖాస్తు ఎలా నింపాలో తెలియడం లేదు. కొంతమందికి రేషన్ కార్డు లేదు, దరఖాస్తు ఫారంతో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ జత చేయమంటున్నారు. రేషన్ కార్డు లేని వారి పరిస్థితి ఆందోళనగా ఉంది. రేషన్‌కార్డు లేనివారికి ఈ గ్యారంటీలు ఎస్తాయా.. రావా అనేది అధికారులు చెప్పడం లేదు. ప్రజాపాలన అస్తవ్యస్తంగా ఉంది. కుటుంబంలో కొంతమందికి రేషన్ కార్డులో పేర్లు లేవు. దీనిపై అధికారుల నుంచి స్పష్టత లేదు. – పయాజ్ షఫీఫ్, నల్లవల్లి, గుమ్మడిదల మండలం (సంగారెడ్డి జిల్లా)

సీఎంఆర్ టార్గెట్ పూర్తి చేయాలి

పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మెదక్ కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు. (ఇన్‌సెట్లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి)

మెదక్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : గత ఆర్థిక సంవత్సరం వానకాలం, యాసంగికి సంబంధించి మిల్లర్లకు కేటాయించిన రోజువారీ లక్ష్యాలను మిల్లింగ్ కెపాసిటీ ప్రకారం డెయిలీ టార్గెట్ పూర్తి చేసేలా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వానకాలం, యాసంగిపై ప్రధాన కార్యదర్శి, కమిషనర్ డీఎస్ చౌహాన్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మెదక్ కలెక్టర్ రాజర్షి షా, సంబంధిత అధికారులతో సీఎంఆర్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి సూచనల మేరకు జిల్లాలో ఎలాంటి జాప్యం లేకుండా సీఎంఆర్ డెయిలీ టార్గెట్ పూర్తి చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యాలు పూర్తి చేసే వరకు సంబంధిత మిల్లులను తనిఖీ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీసీఎస్ఓ బ్రహ్మారావు, డీఎం సివిల్ సప్లై హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పత్తి విక్రయాల్లో దళారులను నమ్మొద్దు

మిల్లులో రైతులతో మాట్లాడుతున్న జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 30: పత్తి విక్రయాల్లో దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ప్రభుత్వం నిర్వహిస్తున్న సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలోనే పత్తిని విక్రయించాలని జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు సూచించారు. శనివారం గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని వాసవి, ఈశ్వరసాయి జిన్నింగ్ మిల్లులోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఆయన ఏఎంసీ కార్యదర్శి జాన్‌వెస్లీతో కలిసి పరిశీలించారు. పత్తి కొనుగోళ్లు ఎంత జరిగాయి. ఎంతమొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమచేశారు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులకు సూచనలు చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే రైతులకు సరైన ధర లభిస్తుందన్నారు. గ్రామాల్లో దళారులు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ప్రస్తుతం బీబీమోడ్ నుండి మెక్‌మోడ్‌కు మార్చడం వల్ల సీసీఐ క్వింటాలు పత్తికి రూ.6950 మద్దతు ధర చెల్లిస్తున్నట్లు సీసీఐ అధికారులు వెల్లడించారు. కాబట్టి రైతులు తమ పత్తిని సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించి సరైన పొందాలన్నారు. వారి వెంట సీసీఐ సిబ్బంది, మిల్లర్లు ఉన్నారు.

ఆధార్ కోసం జనం బారులు

హుస్నాబాద్ టౌన్, డిసెంబర్ 30: కాంగ్రెస్ ప్రభుత్వం అందించే పథకాలను పొందేందుకు చిరునామా మార్పులు, నూతన నమోదుకోసం హుస్నాబాద్‌లో ప్రజలు ఆధార్‌కేంద్రం ఎదుట శనివారం బారులు తీరారు. హుస్నాబాద్‌తోపాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన అనేకమంది పిల్లలతో సహా స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రానికి భారీగా తరలివచ్చారు. ఆరు గ్యారెంటీలు పొందేందుకు చిరునామా సరిచేయించుకోవడంతోపాటు నూతనంగా జన్మించిన పిల్లలకు ఆధార్‌నమోదు చేయించేందుకు వీరంతా తరలివచ్చారు. గంటల తరబడి మహిళలు, చంటి పిల్లలతో సహా పడిగాపులు కాశారు.

హుస్నాబాద్‌టౌన్: ఆధార్ కేంద్రానికి పిల్లలతో సహా వచ్చి కూర్చున్న మహిళలు



హుస్నాబాద్‌లోని ఆధార్ కేంద్రం వద్ద బారులు తీరిన మహిళలు